క్లుప్తంగా

ఉచిత టెట్, డీఎస్సీ శిక్షణ

లక్కిరెడ్డిపల్లి: అన్నమయ్య జిల్లా రాయచోటి కేంద్రంగా విద్యానికేతన్ కోచింగ్ సెంటర్‌లో మైనార్టీ విద్యార్థులకు (ముస్లిం, క్రిస్టియన్) 60 రోజుల టెట్, డీఎస్సీ కోచింగ్ ఇవ్వనున్నట్లు కోచింగ్ సెంటర్ డైరెక్టర్ ఎం లక్ష్మీ ముని కుమారి తెలియజేశారు. జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరెన్నీ వివరాలకు కరస్పాండెంట్ కె సుధాకర్ 9550130802 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మల్లాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



మల్లాలమ్మ తల్లి సన్నిధిలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, తదితరులు

పుల్లంపేట: రైల్వేకోడూరు శాసన సభ్యులు అరవ శ్రీధర్, ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మి ఆదివారం మండల పరిధిలోని ఆర్ గొల్లపల్లి గ్రామ పంచాయతీలోని మల్లాలమ్మ తల్లిను ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యే దంపతులకు స్వాగతం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రామ ప్రజలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ రెడ్డయ్య, వెంకట సుబ్బారెడ్డి, వడ్డిపల్లి వెంకటరమణ, రమేష్, రొంపిచెర్ల మురళీ, ప్రసాద్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి విరాళం

చిట్వేలి: మండల పరిధిలోని కంబరాయుడు ఆలయం సమీపాన నూతనంగా నిర్మిస్తున్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి గుడ్లవారిపల్లికి చెందిన బత్తిన చిన్న గుండాల్ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి బత్తిన ఈశ్వరమ్మ ఆలయ శివలింగం పీఠంకు రూ. 55 వేలు వితరణగా ఆదివారం అందించినట్లు ఆలయ నిర్మాణ ధర్మకర్త కట్టా మోహన్ రావు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

కొలువు తీరిన పీర్ల పెట్టెలు

చిన్నమండెం : మొహర్రం ఉత్సవాలలో భాగంగా చిన్నమండెం మండల కేంద్రంలోని పీర్ల మకాన్‌లో పీర్ల పెట్టెలు కొలువుతీరాయి. సోమవారం ఉత్సవాల నిర్వాహకులు పీర్ల పెట్టెలను మకాన్‌లో ఉంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మొహర్రం ఉత్సవాలను పురస్కరించుకొని ఈ కార్యక్రమాలను నిర్వహించగా పెద్ద ఎత్తున భక్తాదులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న సీహెచ్ చంద్రశేఖర్

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు నియోజకవర్గంలోని దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదివారం సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని నరసరాంపేట, వసంత నగర్, ధర్మాపురం ప్రాంతాలకు గుంజన నది రక్షణగోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. కోడూరు–వెంకటగిరి రోడ్డు ప్రారంభించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యానాదయ్య, సుబ్బరామయ్య, జాన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయండి

సుండుపల్లె: విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని గుల్లవాండ్లపల్లి ప్రాథమిక పాఠశాల అభివృద్ధి దాత డాక్టర్ శరత్ గిరిరెడ్డి పేర్కొన్నారు. గుల్లవాండ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సావిత్రమ్మ పదవీ విరమణ సందర్భంగా స్కూల్ కాంప్లెక్స్ సుండుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయన్న అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎర్రప్పరెడ్డి శరత్ గిరి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రమ్మ ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చారని కొనియాడారు. సావిత్రమ్మ విద్యార్థుల అభివృద్ధి కోసం కృషి చేశారని తెలిపారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, వివిధ మండలాల ఎంఈఓలు శ్రీనివాసరాజు, చెన్నకేశవులు, సంబేపల్లె హెచ్‌ఎం నరసింహారెడ్డి, ఏడీ కేశవులు పాల్గొన్నారు.

పశుగ్రాసంతో ఎంతో లాభం

రాజంపేట రూరల్: పాడి రైతులు పశుగ్రాసం సాగుచేసి మేత వేయడంతో పాడి పశువులలో అధిక దిగుబడి పొందవచ్చని పశుసంవర్థకశాఖ ఉప సంచాలకులు విజయబాస్కర్‌రావు తెలిపారు. మండల పరిధిలోని మందరం పంచాయతీలోని కొత్తపల్లి గ్రామంలో ఆదివారం పశుగ్రాస వారోత్సవాలను ప్రారంభించి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పశుగ్రాసం ద్వారా పాల దిగుబడి పెంపొందిచ్చుకొవచ్చని తెలియజేశారు.

నల్లగంగమ్మ తల్లికి ఆషాఢ శోభ

సంబేపల్లె : మండల పరిధిలో వెలసిన శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయానికి ఆషాఢశోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా మండల పరిధిలోని అడవికమ్మపల్లెలో శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి భక్తులు పాదయాత్రగా అమ్మవారికి సారె తీసుకొని నల్లగంగమ్మ ఆలయానికి చేరుకొని అమ్మవారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించి సారె సమర్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

మల్లూరమ్మకు ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యానదిపై కొలువై ఉన్న శ్రీ మల్లూరమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.



సంబేపల్లె : భక్తులకు దర్శనమిస్తున్న నల్లగంగమ్మ

గంగమ్మకు బోనాలు

లక్కిరెడ్డిపల్లి: అనంతపురం గంగమ్మ దేవతకు ఆదివారం వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి, తలనీలాలు అర్పించారు.



లక్కిరెడ్డిపల్లి: ప్రత్యేక అలంకారంలో గంగమ్మతల్లి

ఆదివారం కావడంతో చుట్టు ప్రక్కల ప్రాంతాల వారే కాకుండా ఇతర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసింది.



సంబేపల్లె : నల్లగంగమ్మతల్లికి సారె తీసుకెళుతున్న భక్తులు



చిన్నమండెం: మల్లూరమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

మండల అభివృద్ధికి కృషి చేయాలి

సంబేపల్లె: అధికారులందరూ సమన్వయంతో పని చేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ మండలంలో అత్యంత ప్రాధాన్యత పనులు గుర్తించి వెంటనే నివేదిక పంపాలని అధికారులకు సూచించారు. మండలంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన పేదలందరికీ జాబ్ కార్డులు మంజూరు చేసి పనులు కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని పేదల కోసం సమర్థవంతంగా నిర్వహిస్తోందని ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు మెరుగైన జీవనోపాధి కలిప్పించే విధంగా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులకు సూచించారు. కాగా.. మండల



మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడడంతో మంత్రి సాధారణ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ నిర్మలాదేవి, అధికారులు పాల్గొన్నారు.

మంత్రి పర్యటన

చిన్నమండెం : చిన్నమండెం మండల పరిధిలో రెండు గ్రామ పంచాయతీలలో రాష్ట్ర రవాణా శాఖ, క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పర్యటించారు. పడమటికోన గ్రామం వడ్డెపల్లెలో పల్లపు చందు, సిద్దార్థ ఇచ్చిన విందులో, కొత్తపల్లె పంచాయతీలో వెంకట్రామిరెడ్డి ఇచ్చిన విందులో పాల్గొన్నారు.

మలకాటిపల్లెపై సుధా లెవెన్స్ విజయం



విజయం సాధించిన అరవపల్లె సుధా లెవెన్స్ జట్టు

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్–3 గ్రామ పంచాయతీ, అరవపల్లిలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నందలూరు ప్రీమియర్ లీగ్ 9వ సీజన్‌లో భాగంగా నిర్వహిస్తున్న హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆదివారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో మలకాటిపల్లి జట్టుపై, సుధా లెవెన్స్ అరవపల్లె విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన మలకాటిపల్లి జట్టు నిర్ణీత 12 ఓవర్లలో ఏడు వికెట్లను కోల్పోయి 71 పరుగులు చేసింది. 72 పరుగుల విజయలక్ష్యంతో బరిలో దిగిన సుధా లెవన్స్ అరవపల్లె జట్టు 7 ఓవర్లలో నాలుగు వికెట్లను కోల్పోయి 76 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ టోర్నమెంట్‌లో ఆర్గనైజర్స్ పల్లె గ్రీష్మంత్ రెడ్డి, ముమ్మడి శెట్టి సుధాకర్, మున్నా, శివకోటి, రంజిత్, క్రీడాకారులు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వైభంగా సహస్ర కలశాభిషేకం

గుర్రంకొండ: మండలంలోని రామాపురంలో వెలసిన శ్రీ జ్ఞానాభిరామస్వామి ఆలయంలో సహస్ర కలశాభిషేకం ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. మూడురోజులు పాటు నిర్వహించిన ఉత్సవాలు నేటితో ముగిశాయి. ఆదివారం ఉదయం ద్వార తోరణ, ధ్వజకుంభ చతురస్రార్చన కార్యక్రమాలు నిర్వహించారు. పంచసూక్తహోమం, శాంతి హోమం, ప్రాయశ్చిత హోమాలు వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో పంచామృతాభిషేకం, సహస్రకళశాభిషేకం, కుంభప్రోక్షణ, మహానైవేద్యం నిర్వహించారు. శ్రీ సీతారాములను అందంగా అలంకరించిన వాహనంలో కొలువుదీర్చి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు.

ఎమార్పీఎస్ ఆవిర్భావ సంబరాలు

తంబళ్లపల్లి: తంబళ్లపల్లెలో ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తహశీల్దారు కార్యాలయం ఎదురు హరిత సర్కిల్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటప్ప, మల్లిఖార్జున ఆధ్వర్యంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. నాయకులు బాస్కర్, బొజ్జప్ప, రమణ, టీడీపీ నాయకులు రామచంద్ర, సిద్దమ్మ, రెడ్డెప్ప రెడ్డి, చలపతి నాయుడు, ఉత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షర్ఫుద్దీన్‌సాహెబ్‌ను పరామర్శించిన శ్రీకాంత్‌రెడ్డి



సర్కాజీ షర్ఫుద్దీన్‌సాహెబ్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి జగదాంబసెంటర్: రాయచోటికి చెందిన మత గురువు, సర్కాజీ షర్ఫుద్దీన్‌సాహెబ్ ఇటీవల గుండె సంబంధిత వ్యాధికి చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. రాయచోటి పట్టణంలో మత గురువు షర్ఫుద్దీన్‌ను మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషాతో కలిసి వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. షర్ఫుద్దీన్‌సాహెబ్ త్వరగా కోలుకోవాలని శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొలిమి



దుగ్గులమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

హరూన్‌బాషా, నియామత్ పాల్గొన్నారు.

దుగ్గులమ్మ సేవలు మరువలేనివి

చిన్నమండెం : చాకిబండ మాజీ ఎంపీటీసీ రామిరెడ్డిగారి దుగ్గులమ్మ సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం చిన్నమండెం మండలం చాకిబండ గ్రామం రెడ్డివారిపల్లెలో జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరమణారెడ్డి మాతృమూర్తి, మాజీ ఎంపీటీసీ దుగ్గులమ్మ దశదినకర్మ కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

అంధత్వ నివారణే లయన్స్‌క్లబ్ లక్ష్యం

రాయచోటి అర్బన్ : అంధత్వనివారణే ధ్యేయంగా లయన్స్ క్లబ్ సేవలను అందిస్తోందని లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.యస్.హరినాథరెడ్డి, జోన్ అధ్యక్షుడు మహమ్మద్, అధ్యక్షుడు శివారెడ్డి అన్నారు. ఆదివారం లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో తిరుపతి అరవింద కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాల ఆవరణంలో ఉచిత కంటి వైద్యశిబిర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవే పరమార్థంగా లయన్స్‌క్లబ్ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో తిరుపతి ఎస్‌వి కంటిఆ



రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సుప్ర తి వైద్యులు గాయత్రి, చైతన్య, వైద్య సిబ్బందిలతో పాటు క్లబ్ మాజీ జోన్ అధ్యక్షుడు కుసుమాకర్, మాజీ అధ్యక్షుడు చాన్‌బాషా, నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు హరీష్‌చంద్ర, కిషోర్‌కుమార్, ఖాదర్ బాషా, శివగంగిరెడ్డి, నూకల రవీంద్ర పాల్గొన్నారు.

మైనార్టీల అభ్యున్నతే ధ్యేయం

రాజంపేట టౌన్: మూమెంట్‌ఫర్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ సంస్థ పేద ముస్లింల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేయాలని ముస్లిం నాయకుడు షేక్ సిరాజుద్దీన్ తెలిపారు. స్థానిక ఆ సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో సిరాజుద్దీన్ మాట్లాడారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ముస్లింల కోసం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను అర్హులకు అందించాలని కోరారు. అలాగే సమాజంలో కుల, మతాలకు అతీతంగా సేవాకార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు ఎస్.ముజఫర్ అహమ్మద్, ఎస్‌జీ.న్యామతుల్లా, ఎస్ఎండీ.కరీం, షేక్ మహబూబ్‌బాషా, మిల్లర్ కరీం, అంజాత్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీజే అధ్యక్షుడిగా మోసిన్‌ఖాన్

మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) సంస్థ రాజంపేట నియోజకవర్గ అధ్యక్షుడిగా రాజంపేట పట్టణానికి చెందిన పీ.మోసిన్‌ఖాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఎంపీజే సంస్థ కార్యలయం



మాట్లాడుతున్న సిరాజుద్దీన్

లో ఆదివారం జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సయ్యద్ నిహాల్, ప్రధాన కార్యదర్శిగా షేక్ అబ్దుల్ రహిమాన్, సహాయ కార్యదర్శిగా అబ్దుల్ రెహమాన్, కోశాధికారిగా షేక్ అలీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీజే నూతన అధ్యక్షుడు మోసిన్‌ఖాన్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని పేద ముస్లింల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

వైఎస్సార్ జయంతి వేడుకలను జయప్రదం చేయండి

ఓబులవారిపల్లె (రైల్వేకోడూరు అర్బన్): దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని కోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, పెనగలూరు, చిట్వేలి మండలాలలో నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ పాల్గొని వైఎస్సార్ జయంతి వేడుకలను నిర్వహించాలన్నారు. అలాగే ఓబులవారిపల్లెలో పార్టీ మండల అధ్యక్షులు వత్తలూరు సాయికిషోర్ రెడ్డి మాట్లాడుతూ ఓబులవారిపల్లె మండలంలోని కొర్లకుంట క్రాస్ రోడ్డు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్దకు కార్యకర్తలు, నాయకులు పాల్గొని వైఎస్సార్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, పంజం సుకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు పుల్లంపేటలో వైఎస్సార్ జయంతి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

పుల్లంపేట: పుల్లంపేట బైపాస్ రోడ్డులో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముస్తాక్, సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ పాల్గొంటారని. ఈ కార్యక్రమంలో ప్రజలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

సీపీఎం నేతపై దాడి అప్రజాస్వామికం

రాయచోటి అర్బన్: పెన్షన్‌దారులకు అండగా నిలబడినందుకు పల్నాడు జిల్లా కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి కామినేని రామారావుపై టీడీపీ వర్గీయులు దాడి చేయడం అప్రజాస్వామికమని సీపీఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మా ట్లాడుతూ ప్రభుత్వం పెన్షన్లను ఇంటింటికి పంపిణీ చేయాలని చెబుతుంటే ఇందుకు విరుద్ధంగా పల్నాడు జిల్లా పగటిర్ల టీడీపీ నాయకుడు చిగురుపాటి ఆదినారాయణ మాత్రం పెన్షన్‌దారులందరూ తన ఇంటివద్దకే వచ్చి పెన్షన్ సొమ్ము తీసుకో వాలని గ్రామంలో చాటింపు వేయించారన్నారు. దీంతో ప్రశ్నించిన రామారావుపై టీడీపీ నేతలు దాడిచేయడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో సీపీఎం నేతలు రామాంజులు, హరిశర్మ, మాధవయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



టి. సుండుపల్లె ఉన్నత పాఠశాల 2004-05 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

సుండుపల్లె: అన్నమయ్య జిల్లా టి. సుండుపల్లె ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు రెండు దశాబ్దాల తర్వాత కలుసుకున్నారు. 2004–05 పదో తరగతి అభ్యసించిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఎక్కడెక్కడో ఉన్నత స్థాయిల్లో స్థిరపడ్డ వారంతా బడి ప్రాంగణంలో అడుగు పెడుతూనే హోదాల ను మరిచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఒకరి యోగ క్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. ఎన్నో ఏళ్ల తరువాత ఒకరినొకరు కలుసుకొని మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. తమ సహ విద్యార్థులు ఎవరైనా అనారోగ్యంతో, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటే వారికి అందరూ కలిసికట్టుగా ఆర్థిక సహాయం అందిస్తామని, అలానే పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ధర్మనాయక్, నాగార్జున్, నాగరాజు, జయప్రకాష్, రఘు, వసంత, సింధూరి, శివకళ, రామ్మోహన్, సుబ్బయ్య, మౌలాలి, భాస్కర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు నిర్మించలేదు

రాజంపేట రూరల్: జాతీయ రహదారిలోని గుండ్లూరు వద్ద అక్రమ కట్టడాలు నిర్మించడం లేదని వైఎస్సార్‌సీపీజిల్లా అధికార ప్రతినిధి గడికోట సుబ్బారెడ్డి తెలియజేశారు. పట్టణంలోని ఆర్ఎస్‌రోడ్‌లోని తన కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించి తనపై వచ్చిన ఆరోపణలు తిప్పికొట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండ్లూరు గ్రామంలోని 124/1, 124/2లో ఉన్న 90సెంట్ల స్థలం మాతమ పట్టా భూమి అని తెలియజేశారు. అక్కడ కల్యాణ మండపాన్ని నిర్మించేందుకు అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వద్ద 2024 జనవరి 27న తన సతీమణి, నందలూరు జెడ్పీటీసీ గడికోట ఉషారాణి పేరుతో అనుమతులు పొందామని తెలియజేశారు. అదే విధంగా పూర్తి కావస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కొరకు 2021 అక్టోబర్‌లో అనుమతి తీసుకున్నట్లు తెలిపారు. ఎన్‌హెచ్ రహదారికి అధికారులు గతంలోనే హద్దులు ఏర్పరిచారని పేర్కొన్నారు. ఆ హద్దులకు లోపల 30 అడుగుల దూరంలో తాము నిర్మాణాలు చేపట్టినట్లు చెప్పారు. కొందరు ఉద్దేశపూర్వకంగా తమ కుటుంబంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇదే విషయంపై సచివాలయ కార్యదర్శి సీ శ్రీనివాసులను వివరణ కోరగా.. అడా అనుమతులు ఇచ్చిన విషయం సమాచార లోపంతో నోటీసులు ఇచ్చామన్నారు.



అడా ఇచ్చిన అనుమతి పత్రాలను చూపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గడికోట సుబ్బారెడ్డి

జిల్లా కలెక్టర్‌ను కలసిన రెవెన్యూ అధికార సంఘం నాయకులు

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్‌గా శ్రీధర్ చామకూరిను అన్నమయ్య జిల్లా ఏపీఆర్ఎస్ఏ (రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్) సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయనకు జిల్లా రెవెన్యూ అసోయేసిషన్ సంఘం జిల్లా అధ్యక్షులు నరసింహా కుమార్, నాయకులు కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలసిన వారిలో రెవెన్యూ అసోసియేషన్ నాయకులు ఉన్నారు.

చైర్మన్ స్పందించారు.. సమస్య పరిష్కరించారు

- మున్సిపల్ చైర్మన్ ఆదేశాలతో వర్షపు నీటి నిల్వలు తొలగింపు
- హర్షం వ్యక్తం చేసిన సరస్వతీపురం వాసులు

రాజంపేట టౌన్: రాజంపేట పట్టణం 12వ వార్డులోని సరస్వతీపురం వీధిలో చిన్నపాటి వర్షం కురిసినా వర్షపు నీళ్లు నిలుస్తున్నాయి. ఈ సమస్యపై గతంలో ఆ ప్రాంత ప్రజలు మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినప్పుడు ఆయన సమస్యను పరిష్కరించాలని సంబంధిత విభాగం అధికారులను ఆదేశించేవారు. అయితే అధికారులు అక్కడి సమస్యను పరిష్కరించేందుకు వెళ్లిన సమయంలో కొంతమంది అడ్డుపడటం వంటివి జరిగేవి. దీంతో అధికారులు కూడా సమస్య పరిష్కారానికి గట్టిగా పనులు చేపట్టలేకపోయేవారు. అయితే ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఆ ప్రాంతంలో నీటినిల్వ ఎక్కువగా ఉండటం వల్ల దోమల వ్యాప్తి అధికమైంది. దీనికి తోడు ఆ మార్గం ద్వారా కేంద్రీయ విద్యాలయం పాఠశాలకు వెళ్లే విద్యార్థులతో పాటు మహిళలు, వృద్ధులు పడుతున్న ఇబ్బందులను అక్కడి ప్రజలు శనివారం చైర్మన్‌కు ఫొటోలు, వీడియోలు చూపించి వివరించడంతో ఆయన చలించి పోయారు. గతంలోనే అక్కడి సమస్య పరిష్కారమైందని అనుకుంటున్నానని, సమస్య తీవ్రత ఇంతగా ఉన్నా మళ్లీ తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ఆయన సరస్వతీపురం వాసులను ప్రశ్నించారు. వెంటనే శానిటేషన్ అధికారులకు ఫోన్ చేసి కేంద్రీయ విద్యాలయానికి వెళ్లే రహదారిలో వర్షపునీరు నిల్వ ఉండకుండా పనులు చేయించాలని గట్టిగా ఆదేశించారు. ఎవరైనా పనులకు ఆటంకం కలిగిస్తే తన దృష్టికి తీసుకురావడంతో పాటు వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. దీంతో ఆదివారం ఉదయమే శానిటేషన్ అధికారులు, సిబ్బంది జేసీబీతో సరస్వతీపురం వీధికి చేరుకొని వర్షపునీరు నిల్వలను తొలగించేందుకు పనులు చేపట్టారు. దాదాపు నాలుగు గంటల పాటు శ్రమించి అక్కడ వర్షం కురిసినప్పుడు నీరు దిగువ ప్రాంతానికి వెళ్లేలా రోడ్డు పక్కన ఖాళీగావున్న స్థలంలో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా కాల్వను ఏర్పాటు చేశారు. దీంతో ఎక్కువగా వర్షపు నీళ్లు నిల్వ ఉంకుండా చాలా వరకు వర్షపు నీళ్లు దిగువ ప్రాంతానికి వెళ్లడంతో ఆ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే ప్రజల కష్టాలను అర్థం చేసుకొని సమస్య పరిష్కారానికి గట్టి చర్యలు తీసుకోవడం పట్ల సరస్వతీపురం వాసులు మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా కేంద్రీయ విద్యాలయానికి వెళ్లే మార్గంలో వర్షపు నీళ్లు పూర్తిస్థాయిలో నిల్వ ఉండకుండా రైజింగ్ రోడ్డు కూడా వేయిస్తామని చైర్మన్ తెలిపారు. అందుకు సంబంధించిన ఎస్టిమేట్ వేయించి రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.



వర్షపు నీళ్లు నిల్వ ఉండకుండా జేసీబీతో కాల్వమార్గాన్ని ఏర్పాటు చేస్తున్న దృశ్యం